క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి
• మంత్రి కొండపల్లి శ్రీనివాస్


పెదవేమలిలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదవేమలి, లక్కిడాం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. పెదవేమలి గ్రామంలో రూ. 23.50 లక్షలు, లక్కిడాం గ్రామంలో రూ.59.5 లక్షలలతో వివిధ రకాల పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి గ్రామానికీ సురక్షిత తాగునీరు అందిస్తామన్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎం. శ్రీనివాస్, ఎంపీడీఓ ఆర్వీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పని
• ఎంపీపీ పీరుబండి హైమావతి


మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. రామవరం గ్రామంలో సోమవారం జరిగిన ఉపాధిహామీ గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. జాబ్‌కార్డు అడిగిన వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు గుర్తించి చేయాలని ఆదేశించారు. పనులు కల్పించడంలో వివక్ష కనబరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరుబండి పద్మ, పీరుబండి జైహింద్‌కుమార్, పి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా 'మీసాల'



మీసాల అప్పలనాయుడు

చీపురుపల్లి: యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మండలంలోని ఇటకర్లపల్లికి చెందిన మీసాల అప్పలనాయుడు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ విజయనగరంలో ఈనెల 24న జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సంఘ ఎన్నికలు నిర్వహించారు. అప్పలనాయుడును సభ్యులు రెండోసారి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇంతవరకు ఆయన ఆరుసార్లు మండలశాఖ అధ్యక్షుడిగా, ఆరుసార్లు జిల్లా కౌన్సిలర్‌గా, ఆరు సార్లు రాష్ట్ర కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మండలంలోని చినసడిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్నారు. ఆయనకి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా..

గజపతినగరం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) వద్ద మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం శోచనీయమని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోయిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవం విషయమై తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు.

కొండచిలువ హతం..


హతమైన కొండచిలువను చూపిస్తున్న రైతులు

లక్కవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామ సమీపంలో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద సుమారు ఏడు అడుగుల కొండ చిలువ సోమవారం కనిపించింది. వెంటనే సమీపంలో ఉన్న రైతులు వచ్చి కొండచిలువను హతమార్చారు. కొద్ది రోజులుగా కళ్లాల్లోని కోళ్లు మాయమవుతున్నాయని, కొండచిలువే వాటిని తిని ఉంటుందని రైతులు అనుమానం వ్యక్తం చేశారు.

నేడు ప్రజావేదిక

మెరకముడిదాం: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది సామాజిక తనిఖీలు పూర్తి చేశారు. ఈ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.భాస్కరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

లక్ష్యం చేరుకునేనా..?

• వేపాడ మండలంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం 16,252 క్వింటాళ్లు
• ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
• రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామంటున్న అధికారులు
• రైతు సేవా కేంద్రాలే కొనుగోలు కేంద్రాలు


జగ్గయ్యపేటలో వరి కోత పనుల్లో నిమగ్నమైన రైతులు

వేపాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మండలంలో ఈఏడాది నవంబర్ నెల పూర్తి కావస్తున్నా ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో అక్టోబర్ నెలలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి. అయితే ఈ ఏడాది అధికారులు నేటికీ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకపోవడంతో లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా చేరుకునేనా అనే సందేహాలు వినిపిస్తున్నాయి.ఈ ఏడాది వరినాట్లు ఆలస్యం కావడంతో కోతలు, నూర్పులు, అన్నీ ఆలస్యమవుతున్నాయి. మండల రైతులు 3,510 హెక్టార్ల విస్తీర్ణంలో ఖరీఫ్ వరిసాగు చేయగా, ప్రస్తుతం 1,755 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల రైతులు నూర్పులు చేసి ధాన్యాన్ని కళ్లాల్లో భద్రపరుచుకుని ఎప్పుడు విక్రయించుకుందామా అని ఎదురు చూస్తున్నారు. అయితే మండలంలో మరో రెండు, మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నామని మండల వ్యవసాయాధికారి సి.బి.యశ్వంతరావు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం మండల రైతుల నుంచి 16,252 క్వింటాళ్ల ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకుందని వివరించారు. మండలంలో 18 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని, 18 రైతు సేవా కేంద్రాలను తొమ్మిది క్లస్టర్లుగా విభజించామని పేర్కొన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఒక డీఈఓ, ఒక టీఏ, హెల్పర్ విధులు నిర్వర్తించనున్నారు. రైతుల కల్లాల వద్దకు టీఏ వచ్చి ధాన్యం శాంపిల్స్ సేకరించి రైతు సేవా కేంద్రంలో తేమశాతం పరీక్షిస్తారు. తేమ 17 శాతం ఉంటే మిగిలిన పరీక్షలు చేస్తారు. అన్ని టెస్టులు చేసిన తర్వాతే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రొడక్ట్ సప్లై ఏజెన్సీ వారు గోనె సంచులు, లేబర్‌ను, వెహికల్‌ను పంపిస్తారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపించుకోవచ్చు. వ్యవసాయశాఖ షెడ్యూల్ ప్రాప్తికి రైతు ధాన్యం తీసుకెళ్లాల్సి ఉంటుంది. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320గా నిర్ణయించారు. ఒక గోనె సంచికి (40కేజీలు) రూ.3.30, లేబర్ చార్జీలు క్వింటాల్‌కి రూ.17.17, కిలో మీటర్ల ఆధారంగా రవాణాచార్జీలు ప్రభుత్వమే చెల్లించనుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

లింగ వివక్ష లేని సమాజమే లక్ష్యం


గరివిడిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, మహిళలు


దత్తిరాజేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వెలుగు, వైద్య సిబ్బంది


వేపాడలో ర్యాలీ చేస్తున్న అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు


మెరకముడిదాంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి)/వేపాడ/దత్తిరాజేరు/మెరకముడిదాం: లింగవివక్ష లేని సమాజం కోసం అంతా కృషి చేయాలని, మహిళలపై దాడులను, హింసను వ్యతిరేకించాలని గరివిడి, వేపాడ, మెరకముడిదాం మండలాల వెలుగు, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గరివిడి, వేపాడ, దత్తిరాజేరు మండలాల వెలుగ సమాఖ్యల ఆధ్వర్యంలో ఆయా మండల కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓఏలు, వెలుగు సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్త్రీ, పురుషులు సమానమేనని, వారిలో ఏ ఒక్కరూ ఏ ఒక్కరి కంటే తక్కువ, ఎక్కువ కాదన్నారు. పని ప్రదేశంలో, ఇళ్లల్లో మహిళలు హింసకు గురికాకుండా చూడాలని కోరారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేస్తామని, లింగవివక్ష చూపబోమని ప్రతిజ్ఞ చేశారు. గరివిడి, వేపాడ, మెరకముడిదాం మండలాల వెలుగు ఏపీఎంలు పి.నారాయణరావు,డి.సూర్యనారాయణ, ధనలక్ష్మి, వేపాడ,దత్తిరాజేరు, మెరకముడిదాం ఎంపీడీఓలు రాజేంద్రప్రసాద్, సూర్యనారాయణ, జి.భాస్కరరావు, మెరకముడిదాం తహసీల్దార్ అజురఫీజాన్, దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

చీపురుపల్లి: యాజమాన్యం మొండి వైఖరి విడనాడి తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలని కర్లాంలోని శ్రీ వెంకట్రామ పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులు డిమాండ్ చేశారు. పరిశ్రమ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం లెక్కల ప్రకారం 2024 జూన్ నెలలో వేతన ఒప్పందం అమలు చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ నెల వచ్చేస్తున్నా వేతన ఒప్పందం అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికశాఖ వద్ద పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా యాజమాన్యం వేతన ఒప్పందం అమలు చేయాలని, లేకపోతే భవిష్యత్‌లో పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ నేతల తీరు అవమానకరం

• ధాన్యంకొనుగోలు కేంద్రం ఫ్లెక్సీలో ముద్రించని మోదీ చిత్రం
• అసహనం వ్యక్తంచేసిన బీజేపీ నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సరిది దుర్గారావు, పాల్గొన్న నాయకులు

గజపతినగరం: గజపతినగరం మండలంలో మంత్రి కొండల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మూడు కార్యాక్రమాల్లో బీజేపీ నేతలను అవమానించడం సరికాదని గజపతినగరం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ సరిది దుర్గారావు అన్నారు. గజపతినగరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడుతున్న మోదీ చిత్రం లేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. వివిధ కార్యక్రమాలకు హాజరైన బీజేపీ నాయకులు, కార్తకర్తలకు కనీస గౌరవం ఇవ్వకుండా అవమానించారని ఆరోపించారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులను పేరు, పేరున పిలిచి బీజేపీ నాయకులను పిలవకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మండపాక భారతి, యువమోర్చా మండలాధ్యక్షుడు కుమిలి గణేష్, మండల ప్రధాన కార్యదర్శి తవుడు, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు భాస్కరరావు, రామలింగాచారి, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

• మానవీయతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోవిందరాజులు


విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న మానవీయతా సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎదుట వ్యక్తి జీవితంలో ఆనందాన్ని నింపడానికి ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని మానవీయతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు పిలుపునిచ్చారు. గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు సోమవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనిషి మరణాంతరం అవయవాలు మట్టిలో కలిసిపోకుండా.. వేరేవారికి జీవితం ఇచ్చేలా ఆలోచించాలన్నారు. అవయవదానంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న బొత్స..


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: మండలంలోని తిమిటేరులో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మండల శ్రీను కుటుంబీకులు నిర్మించిన ముత్యాలమ్మ గుడి ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.నారాయణమూర్తి, మహదేవ్ ఫణీంద్రుడు, చలుమూరి సన్యాసిరావు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి


కొత్తవలస: అడ్డూరువానిపాలెంలోని కేజీబీవీలో పదోతరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న జిల్లా అకడమిక్ మానటరింగ్ బృంద సభ్యులు


చీపురుపల్లి: కర్లాం కేజీబీవీలో ఉపాధ్యాయినుల బోధనా నైపుణ్యాలను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ టీమ్

కొత్తవలస: విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునేలా బోధించాలని సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి వి.ఆదినారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా అకడమిక్ మానటరింగ్ బృంద సభ్యులతో కలిసి మండలంలోని అడ్డూరువానిపాలెంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) గొల్లపేట, సీతంపేట ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను, విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బోధన నైపుణ్యాలను పెంచుకునేందుకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా అకడమిక్ మానటరింగ్ బృందసభ్యులు వై.సుబ్రహ్మణ్యం, వి.గోపీచంద్, ఎస్.సూర్యారావు, ఎంఈఓలు జి.శ్రీదేవి,బండారు శ్రీనివాసరావు, కేజీబీవీ ఎస్ఓ విజయకుమారి పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

చీపురుపల్లి: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కె.వి.రమణ సూచించారు. అలజంగి ప్రాథమిక పాఠశాల, కర్లాం ఉన్నత పాఠశాల, కేజీబీవీని జిల్లా అకడమిక్ మానటరింగ్ కమిటీ సోమవారం సందర్శించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు, ఆరు నుంచి పదోతరగతి వరకు విద్యాప్రమాణాలు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను అకడమిక్ కమిటీ పరిశీలించింది. ఉపవిద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు తెలుసుకుని మరింత మెరుగుపరిచేందుకు సూచనలు చేసేందుకు జిల్లా అకడమిక్ కమిటీని నియమించారని చెప్పారు. సమగ్ర శిక్ష ఏఎంజగన్, డైట్ అధ్యాపకులు ఎల్.రామకృష్ణ, ఎంఈఓ బూసినాయుడు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

శంభో శంకర

కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలు హరహర మహాదేవ శంభో శివ శంకర నామస్మరణతో మార్మోగాయి. శివయ్య దర్శనం కోసం వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు.అర్చకులు భక్తులతో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. పలు ఆలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు. కొత్తవలస మండలం తుమ్మికాపల్లిలోని ఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు అర్చకులు 324 కొబ్బరి కాయలతో అభిషేకాలు చేశారు. లక్కవరపుకోట మండలం రంగారాయపురంలో ఏర్పాటు చేసిన గౌరమ్మ మండపంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు పూజలు చేశారు. బొండపల్లి మండలంలోని గెద్దపేట శివాలయంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. – సాక్షి నెట్ వర్క్


కొత్తవలస: తుమ్మికాపల్లిఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న అర్చకులు


గజపతినగరం: గజపతినగరం శివాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు


గుర్ల : గుర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బొండపల్లి: గెద్దపేట శివాలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్


శృంగవరపుకోట: పుణ్యగిరి శివాలయం వద్ద భక్తుల సందడి


కొత్తవలస: చింతలపాలెం శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు


కొత్తవలస: చింతలపాలెంలో శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


దత్తిరాజేరు: కోమటిపల్లి సోమలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


గజపతినగరం: గజపతినగరం శివాలయంలో దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


వేపాడ: బానాది శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వేపాడ: శింగరాయిలో అన్నదానం

వైభవంగా గౌరమ్మ నిమజ్జనోత్సవం

వేపాడ: మండలంలోని బానాదిలో కొలువుదీరిన గౌరీపరమేశ్వరులను (గౌరమ్మ) సోమవారం రాత్రి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టి నిమజ్జనోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు సర్పంచ్ కర్రి యశోద, గళ్ల రామచంద్రుడు, నక్క వెంకటరమణ, తదితర పెద్దల ఆధ్వర్యంలో గౌరమ్మకు నెల రోజుల పాటు పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహిళా సాధికారతకు నిదర్శనం


మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి నాగార్జున

కొత్తవలస: సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని చిరుధాన్యాల చెల్లెళ్ల సంఘం మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలిచిందని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున అన్నారు.గొల్లలపాలెం గ్రామంలో చిరుధాన్యాల ఉత్పత్తిదారుల సంఘ వార్షిక సమావేశం సంఘం ప్రతినిధి కర్రి జోగినాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి నాగార్జున చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న సబల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ టి.ఎస్.ఎస్.పాత్రో, తేజేశ్వరరావు,అనురాధ,త్రివేణి, సర్పంచ్ మంగమ్మ, సబల సంస్థ ప్రతినిధి సరస్వతి పాల్గొన్నారు.

రక్షణ కల్పించి నిలువ నీడ ఇప్పించండి

• ఎస్పీకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం

చీపురుపల్లి: తన మామ, బావ, మరిదిల నుంచి రక్షణ కల్పించి, ఉండడానికి నిలువ నీడ ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామానికి చెందిన కోడిగుడ్ల మంజు ఎస్పీ వకుల్ జిందాల్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. మామ, బావ, మరిదిలు కలిసి తనను, తన భర్తను మానసికంగా వేధిస్తున్నారని, తమను ఇంటి నుంచి గెంటివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత పదిహేను రోజులుగా చలిలో రోడ్డుపైనే పిల్లలతో పడి ఉన్నామని గోడు వినిపించారు. నవంబర్ 12న చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినా ఎస్ఐ కనీసం పట్టించుకోలేదని, హేళనగా మాట్లాడి అవమానపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన పిల్లలతో సహా ఇంటి నుంచి గెంటివేసి తమను వేధింపులకు గురిచేస్తున్నవారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


గజపతినగరం: గజపతినగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్


గుర్ల: కెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ సూర్యనారాయణరాజు

గజపతినగరం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చిన్న,మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. స్థానిక పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే పాతబగ్గాంలో గ్రామ సచివాలయం, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ సేతు మాదవ్, వ్యవసాయశాఖ జేడీ బి.టి. రామారావు,సివిల్ సప్లయ్ డీఎం మీనాకుమారి, తహసీల్దార్ రత్నకుమార్,ఎంపీడీఓ కల్యాణి, మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన నాయకుడు సురేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

మండల కేంద్రంలోని మండల పరిషత్‌కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా సమస్యలు, ప్రగతిపై అధికారులను ఆరా తీశారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబం

గుర్ల: కెల్ల పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ మాజీ చైర్మన్ కె.వి.సూర్యనారాయణరాజు సోమవారం ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.